# 16. కాటికి వెళ్లని కరణాలు

తెలుగువాళ్ళను మించిన త్యాగశీలురు, అమాయకులు లేరని ఈ వరకే ఎందరో తలనెరిసిన, పళ్లూడిన పెద్దలు సర్టిఫికేట్లిచ్చి ఉన్నారు. బుజగించేందుకే మనకిది ఉగ్గుబాలతో వంటబట్టిన సుగుణమని మన పెద్దలు మనతో అవసరం వచ్చినప్పుడల్లా గుర్తు చేస్తుంటారు.

నిజమే! మన సంగతి మనకన్నా, మనల్నేలుతూ, చుట్టపక్కాలకు ఉద్యోగాలూ, పర్మిట్లూ ఇప్పించుకుంటూ, మేడలు కట్టుకునే ఈ పెద్దలకే బాగా తెలుసు. మన ఈ సుగుణాల్ని క్యాష్ చేసుకుంటూ మన నెత్తిన కూర్చుని పెత్తనం చెలాయించటం కూడా బాగానే తెలుసు వీళ్ళకు.

మన జీవనాడులు వీళ్ళకు అవగతం ఎలానో, అలాగే వీళ్ళ గోత్రాలు ఢిల్లీలోని వీళ్ళ 'బాస్'లకు తెలుసు. వీళ్ళ పిలకల్ని పట్టుకోవటం, వాటిని కుదవటం లేదా-ఊడ పీకటం ఎలానో కూడా వాళ్ళకు బాగానే తెలుసు. కనుకనే ఇక్కడ తెలుగు దేశం ఆందోళనతో భగ్గుమంటూంటే ఢిల్లీలోని బడా హీరోలు నిర్లక్ష్యంగా 'ఓం శ్శాంతి! శ్శాంతి' అంటూ వేద పఠనంతో కాలక్షేపం చేయగలుగుతున్నారు.

దెయ్యాలు వేదాలు వల్లించే సోషలిస్టు స్వర్ణయుగం మనది. ఈ దెయ్యాలకు ఓట్లిచ్చి, పీటలువేసి, కొరివి చేతి కిచ్చి, దాంతో తల గోకించుకునే అమాయకులం మనం. ఆ కొరివిని గుంజుకుని వాళ్ళ పీటల క్రింద పెట్టటంచేతగాక మనలో మనం తన్నుకు చస్తున్నాం ఈనాడు.

వెనకటికి గోబెల్స్ అని ఈ సోషలిస్టు దెయ్యాల మూల పురుషుడొక డుండేవాడు. ఎంత పచ్చి అబద్ధాల్నయినా వందసార్లు ఉద్ఘాటిస్తే మహా మేధావులు కూడా నమ్మితీరు తారనేది వాడి సిద్ధాంతం. తెలుగు జాతి భవిష్యత్తు గొర్రె తోకలా మిగిలిపోవటానికిమూలం 'సమైక్యత'లోనే ఉందంటూ "కలసి ఉంటే కలదు శోకం" అని వీళ్ళు దొరికినన్ని వాద్యాలూ సమకూర్చుకుని రాగ తాళయుక్తంగా వెనక పాడారు. ఈనాడూ పాడుతున్నారు. తత్ఫలితంగా 'మన మంతా ఒక్కటే!" అనుకునే మేధావులలో కూడా చాలా మంది ఈనాడు "విష్ యూ ఎ హాపీ సెపరేట్ న్యూ ఇయర్" అనే దాకా రాగలిగారు.

కరణాన్ని కాటికి వెళ్ళినా నమ్మరాదని ఓ సామెత! వాళ్ళను మించినవాడు ముల్కీపిత నిజాం నవాబు. తన రోజులలో తెలుగువాడు తెలుగు మాట్లాడితే వాంతులు చేసు కుని శివాలు తొక్కిన వాడు నిజాం నవాబు. కోటిన్నర మందికి తెలుగు చదువుకునే జన్మహక్కు లేకుండా అడ్డుపడ్డ వాడు నిజాం నవాబు. వారి రక్తం పిండుకుని పాతాళా

న్నందే పాతర్లు పెంచుకున్న వాడు నిజాం నవాబు. తెలుగు దేశాన్ని చీల్చి అందులో కొంత అత్త సొమ్ములా బ్రిటిష్ వాళ్ళకు ధారాదత్తం చేసిన వాడు నిజాం నవాబు.

"నిజాం సర్కారోడా। నాజీలను మించినోడా। గోల్కొండా ఖిల్లా క్రింద నీ గోరీ కడ్తం కొడకో"। అని గర్జించిందా నాడు తెలుగుజాతి. అది ముల్కీ-నాన్ ముల్కీ భేదంలేకుండా తెలుగుజాతి పట్టినప్రతిజ్ఞ। ముల్కీ-నాన్ముల్కీ భేదం లేకుండా నాలుగు వేల మంది తెలుగు బిడ్డలు రక్తం ధారవోసి నెరవేర్చారా ప్రతిజ్ఞ।

అయినా వాడు పెట్టి వెళ్ళిన ముల్కీ చిచ్చు తెలుగు దేశాన్ని ఈనాటికీ భగ్గున మండిస్తూనే ఉంది. నిప్పును నీళ్ళతో గాక పెట్రోలుతో ఆర్పుదామనే మహానాయకులు దాపురించారు మనకు.

తెలుగు వాళ్ళేగాదు. సామాన్యులెప్పుడూ నిజంగా అమాయకులే. రాజకీయాల లోతు పాతులు తెలియని ఈ అమాయకుల మధ్య చిచ్చు పెట్టడం సులభం. ఆ చిచ్చు లోంచి పదవుల్ని పండించుకోగల ఘనులున్న దేశం మనది.

శతాబ్దాలపాటు వచ్చి బానిస వ్యవస్థలో త్రొక్కి పెట్టబడ్డది తెలంగాణా! ఆ శృంఖలాలను వదలించుకుని మహదానందంతో భవిష్యత్ కోసం పరికించిన జాతికి ఎదురయ్యింది దరిద్రం. నిరుద్యోగం, నిరాశ.

అందుకు మూలం ఈ వ్యవస్థ. తొంభై మంది అర్ధాకలితో చస్తుంటేనే గాని పదిమంది పరమాన్నం తినేందుకు అవకాశం ఇవ్వని ఈ దుష్ట వ్యవస్థ. అందుకు కారకులు పీటలెక్కి ఆ పది మంది తరపున పెత్తనం వెలగబెట్టే మన మహానాయకులు.

ఈ వీర తెలంగాణా మూడేళ్ళనాడు మత్తు వదిలించుకుని లేచి నిలబడి హుంకరించింది. రెండేళ్ళపాటు పాలకుల్ని ధిక్కరించి వీరావేశంతో పోరాడబూనుకున్ననాడు గడగడలాడిపోయారీ మహానాయకులు. తక్షణం ప్లేట్లు మార్చేసి పీడితుల పాలిటి హీరోల్లా ఫోజులు పెట్టి ఉద్యమాన్నే పెడదార్లు పట్టించి జాతిలో ఒక భాగంపై మరో భాగానికి విషం నూరిపోసేరు. "నీ చేనులోకి నీళ్ళురాకపోవటానికి కారణం నీ అన్న ఆ నీళ్ళన్నీ భోంచేయటమేరా నాయనా? అని కరణం స్టైలులో వీళ్ళానాడు తీర్పులిచ్చేరు.

తీరా సమయం రాగానే దొంగలంతా కలసి జాతిని జోకొట్టి, ఊళ్ళు పంచుకోవటంలో తమలో తాము సర్దుబాట్లు చేసుకుని పదవుల్లో దూరి సంపాదనలో పడిపోయేరు. జాతి పురోగమనం మాత్రం ఎక్కడిదక్కడే గొంగళిలా మిగిలిపోయింది.

సరిగ్గా అదే కథ ఈనాడు మరో రూపంలో పునరుద్ధృతం అవుతోంది.

ముల్కీ రూల్సు వల్ల తమకున్న ఉద్యోగావకాశాలు

పోతాయనే ఈనాటి, రేపటి నిరుద్యోగుల ఆందోళన నెవరూ అర్థరహిత మనలేరు. జాతిమధ్య వివక్షతను రెచ్చగొట్టే ముల్కీ రూల్స్ నెవరూ ఈనాడున్న రూపంలో సహించనూ లేరు.

కానీ, ఆవేశంలో అందరూ ఒకటి మరచిపోతున్నారు, ముల్కీరద్దుచేయటం వలన గానీ, ప్రత్యేక రాష్ట్రాలు ఏర్పడ్డం వలన గానీ! ఈ దరిద్రం, నిరుద్యోగం మాయం అయిపోను న్నదా? అక్టోబరు 72 నాటికి ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజీల్లో రిజిష్టరు చేయించుకున్న రెండు లక్షల ముప్పయ్యాయిదు వేల మందికి ఉద్యోగాలు ఊడిపడనున్నాయా ! విడిపోదాం అని గర్జిస్తున్న మన మహా నాయకులు ఇన్ని ఉద్యోగాలను ఎలా పుట్టించనున్నారు ? వాళ్ళు అంత శక్తిమంతులే అయితే మరి ఇంతకాలం పెత్తనం చేస్తూ కూడా ఏమీ ఎందుకు చెయ్యలేక పోయినట్లు ?

నిన్నగాక మొన్న కడుపు కాలిన నాలుగున్నర లక్షల మంది ఎన్‌జీవోలు ముల్కీ నాన్‌ముల్కీ భేదం లేకుండా 56 రోజులు పాటు సమ్మె చేస్తే ఈనాడు వాళ్ళ పాలిటి ఛాంపియన్‌లలా ఫోజులు పెడుతున్న ఈ మహా నాయకులా నాడేం చేశారు. ఆనాడు ఎన్జీవోల కడుపులు కొట్టి లొంగ దీసేందుకు నానా తిప్పలూ పడ్డ వాళ్ళా నేడూ-రేపూ మన ల్నాదుకోనున్న ఛాంపియన్‌లు!

ఉద్యోగం దొరుకుతుందంటే అండమాన్‌లకు కూడా వలస పోగలవాడు తెలుగువాడు. దున్నుకోటానికింత నేల దొరుకుతుందంటే దండ కారణ్యంలో కూడా కాపురం పెట్ట గలవాడు తెలుగువాడు. అలాంటి తెలుగువాడు అటు తెలం గాణాను గానీ, ఇటు ఆంధ్రను గానీ దోచుకుంటున్నాడనో, అన్యాయం చేస్తున్నాడనో అనటం నీచాతి నీచమైన నింద.

ఈ నిందలు పుట్టించే వాళ్ళే నిజంలో దోపిడీదార్లు. ఏ ప్రాంతాలలో నయినా దోపిడీదార్లు పాలకులూ. వారి అండతో బతికేవాళ్ళే గానీ సామాన్యులు గారు.

తమను కొల్లగొట్టుకుని ఆంధ్రులు బలిసిపోతున్నారని భ్రమ పడే తెలంగాణా వారు ఇటు రాయలసీమ గానీ, అటు శ్రీకాకుళం, విశాఖగానీ వెళ్ళి చూస్తే తమకన్నా అన్యా యంగా ఉన్న అక్కడి పరిస్థితులకు చలించి పోకుండా ఉండ లేరు. వాళ్ళను ఉద్ధరించేందుకే ఉన్నామనే చలువ దుస్తుల మహానాయకుల్ని అసహ్యించుకోకుండా ఉండలేరు.

అలాగే తెలంగాణా వారు దురాశా పరులు, బ్లాక్ మెయిలర్స్ అనే నాయకోత్తముల ప్రవచనలు నమ్మే వారెవ రేనా ఈ జాతి చరిత్ర పరిశీలిస్తే వాళ్ళు నిందించగలది స్వార్థ పరులైన నాయకుల్నీ, భూస్వామ్య వర్గాల్నే గానీ. తమ వంటి వాళ్ళే అయిన సామాన్య ప్రజల్ని గాదు.

జాతి అంటే, ప్రజలంటే నూటికి పదిమందిగా వున్న

భూస్వాములు గారు. ధనికవర్గం కాదు. జాతి భావాలకు ప్రతిబింబాలమనే ఈదగాకోరు నాయకులంత కన్నా కాదు.

నరజాతి చరిత్ర సమస్తం పరపీడనా పరాయణుల మయం. ఆనాటి తెలంగాణా ఉద్యమం, ఈనాటి ఆంధ్ర ఉద్యమం కూడా ఇందులోంచి మినహాయింపు కావు. విశేషం ఏమంటే ఆనాడూ, ఈనాడూ కూడా పీడితులు లేవదీసిన ఉద్యమాలకు పీడకులే నాయకత్వం వహించి పెడదార్లు పట్టించగలగటం!

లేకుంటే ఈనాడిన్ని కబుర్లు చెబుతున్న నాయకులు ఇన్నాళ్ళూ పెత్తనంలో ఉండి దేశానికి ఒరగబెట్టిందేమిటి?

ఇన్నేళ్ళలోనూ తెలుగు దేశానికి ఒక్క ప్రాజెక్టు నన్నా సాధించగలిగారా? ప్రజలు పోరాడి సాధించుకున్న నాగార్జునసాగర్‌ను ఉన్నదాంట్లో సగం నీరే వాడకంలోకి వచ్చేలా కుదింపజేసింది ఈ మహానుభావుల పెత్తనంలోనే గాదా!

పోచంపాడు ప్రాజెక్టువల్ల రాగల ఫలితాన్ని డబ్బు లేదని వంకపెట్టి నాలుగో వంతుకు కుదించిందీ ఈ ప్రజా సేవకులే కాదా!

దేశంలో పారిశ్రామిక ఆదాయం 18 శాతం ఉండగా మన రాష్ట్రంలో 7 శాతం ఉంటే పట్టనట్లు చూస్తూ కూర్చున్నదీ నిన్నటి పాలకులే గాదా! రాష్ట్రంలో ఒక్క

పరిశ్రమను స్థాపించినా కొన్ని వేలమంది నిరుద్యోగుల కడుపులు నిండుతాయని తెలిని అమాయకులా వీళ్ళు?

వీళ్ళను నమ్మి, నాయకత్వం అప్పగించి, అయిదొందల మందికన్నా అదనంగా ఉద్యోగాలిప్పించలేని "ముల్కి" కోసం తన్నుకు చావకపోతే ఆంధ్ర-తెలంగాణా భేదం లేకుండా ఈ మహాజాతి యావత్తు ఏకంగా నిలబడి ఈ దుష్ట వర్గాన్నెందుకు మట్టు పెట్టరాదూ?

విశాలాంధ్రలో ప్రజారాజ్యం సాధించలేని వారు అందుకు దోహదం చేయలేని అసమర్థులు ప్రత్యేకాంధ్రలో ప్రత్యేక తెలంగాణాలో ప్రజారాజ్యం స్థాపించగల మనుకోవటం దిగజారిన ఆత్మ విశ్వాసానికి మాత్రమే చిహ్నం. జాతిని చైతన్యవంతం చేయలేని నీరసుల అహంభావానికి మాత్రమే అది ప్రతిబింబం.

ఈ పనికి మాలిన ప్రలాపనలతో జాతిని నీరసపరచటం క్షమించరాని ద్రోహం. జాతిని సమైక్యంగా పీడకులకు వ్యతిరేకంగా నడపగలవారే నిజమైన నాయకులు. అందుకు దోహదం చేయగలవారే నిజమైన మేధావులు.

(జనవరి 1973)